VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ బుధవారం 31 జూలై 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 03



సిఎం రేవంత్‌తో నటుడు అర్జున్ భేటీ

2లో

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



# వయనాడ్ విలయం..
## 'అరేబియా' వేడెక్కడమే కారణమా?

అరేబియా సముద్ర తీరంలో ఈ తరహా దట్టమైన మేఘాల ధోరణిని ముందుగానే గుర్తించినట్లు వాతావరణ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

**123 మంది మృతి. 800 మంది గల్లంతు.**

**వయనాడ్ :**జిల్లా మెప్పడి, మండక్కై, చూరాల్‌మల, అట్టామల, నూల్‌పుజా గ్రామాల్లో సోమ, మంగళవారాల్లో భారీ వర్షాలు బీభత్సం సృష్టించాయి. కొండ చరియలు విరిగిపడి గ్రామాల ఆనవాళ్లు లేకుండా పోయాయి. వందల ఇళ్లు నేలమట్టమయ్యాయి. వందల మంది బురద మట్టిలో కూరుకుపోయారు. వారిలో 123 మంది మృతదేహాలను ఇప్పటిదాకా అధికారులు వెలికితీశారు. గాయపడిన 128 మందిని ఆసుపత్రులకు తరలించారు. మరో 98 మంది ఆచూకీ తెలియడం లేదు. మరోవైపు ఈ గ్రామాల్లోని టీ, కాఫీ తోటల్లో పనిచేసే 600 మంది వలస కూలీల ఆచూకీ దొరకడం లేదు. అనేక మంది శిథిలాల కింద చిక్కుకుని ఆర్తనాదాలు చేస్తున్నారు. వీరిని కాపాడేందుకు సహాయక బృందాలు రంగంలోకి దిగాయి. సైన్యం, ఎన్డీఆర్ఎఫ్ సాయంతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. తాళ్ల సాయంతో వరదల్లో చిక్కుకున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. వయనాడ్ విపత్తు నేపథ్యంలో కేరళ ప్రభుత్వం రెండు రోజులు సంతాప దినాలుగా ప్రకటించింది. మరోవైపు వయనాడ్‌లో ప్రమాదం జరిగిన ప్రాంతాల్లో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్, ప్రియాంకాగాంధీ బుధవారం పర్యటించాలనుకున్నా ప్రతికూల వాతావరణం కారణంగా వాయిదా పడింది.కోజికోడ్ ఉత్తర ప్రాంతంలోని విలాంగడు, మలయాంగడు గ్రామాల్లో కొండ చరియలు విరిగిపడి వంతెనలు, రోడ్లు కొట్టుకుపోయాయి. ఒకరు గల్లంతుకాగా పలు ఇళ్లు ధ్వంసమయ్యాయి.

**ధ్వంసమైన ఇల్లు, కారు**

**నిద్రలో ఉండగానే...**

సోమవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో గ్రామస్థులంతా నిద్రలో ఉండగా ఒక్కసారిగా కొండ చరియలు విరిగిపడ్డాయి. దీంతో కొండ ప్రాంతం విధ్వంసమైంది. ఇళ్లన్నీ నేలమట్టమయ్యాయి. బురద మట్టిలో కూరుకుపోయిన గ్రామస్థులు ఆ మట్టిలోనే కలిసిపోయారు. తొలుత మండక్కై ప్రాంతంలో కొండచరియలు విరిగిపడ్డాయి. సమాచారమందుకున్న సహాయక సిబ్బంది వెంటనే అక్కడకు వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. కొంత మంది బాధితులను సమీపంలోని చూరాల్‌మలలోని వెల్లారిమల పాఠశాలవద్ద ఏర్పాటు చేసిన సహాయక శిబిరానికి పంపించారు. మంగళవారం తెల్లవారుజామున 4.10 గంటలకు ఈ పాఠశాల సమీపంలో మరోసారి కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో శిబిరంసహా చుట్టుపక్కల ఇళ్లు, దుకాణాలు బురదలో కూరుకుపోయాయి. అనేక వాహనాలు అందులో ఇరుక్కుపోయాయి. చూరాల్‌మల గ్రామంలోని కొంత భాగం తుడిచి పెట్టుకుపోయింది. మండక్కైలో మంగళవారం మధ్యాహ్నం మరోసారి కొండచరియలు విరిగిపడ్డాయి. మీడియాలో ప్రసారమైన ప్రమాదానంతర దృశ్యాలు హృదయ విదారకంగా ఉన్నాయి. బాధితుల ఫోన్ విజ్ఞాపనలు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. మట్టిలో కూరుకుపోయిన వారి ఆచూకీ కోసం సైన్యానికి చెందిన శునకాలను వినియోగిస్తున్నారు.



# బిఆర్ఎస్ కొత్త డ్రామాలకు తెర

**ఎమ్మెల్యేల యూటర్న్ అంటూ ప్రచారం**

**అలాంటిదేమీ లేదు..మరికొందరు చేరుతారు**

**మంత్రులు పొంగులేటి, కోమటిరెడ్డిల ధీమా**

**బిఆర్ఎస్ డ్రామాలను నమ్మరన్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు**

హైదరాబాద్: ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ వైపు వెళ్లడం లేదని.. అదంతా గులాబీ నేతలు చేసుకుంటున్నా ప్రచారమేనని మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంటకటరెడ్డి, ఇతర ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు. ఇదంతా బిఆర్ఎస్ ఆడుతున్న డ్రామాలని అన్నారు. తమ ఎమ్మెల్యేలు జారి పోవడంతో కొత్త డ్రామాలకు తెరలేపారని అన్నారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు ఎక్కడికి పోరని మంత్రి పొంగులేటి తేల్చిచెప్పారు. మంగళవారం నాడు అసెంబ్లీ లాబీలో మీడియాతో చిట్ చాట్

చేశారు. పాత పరిచయం కాబట్టి కలసి ఉంటారని అన్నారు. తమ దగ్గరకి వచ్చిన నేతలు ఎవరు ఇబ్బంది కలగకుండా ఉంటారని చెప్పారు. తమ దగ్గర ప్రేమ రాజకీయాలు ఉంటాయని అన్నారు. ఎవరు ఎక్కడికి పోరని మంత్రి

మిగతా 2లో


## హోంమంత్రి పదవి ఇస్తే..కాంగ్రెస్‌లో చేరుతా

బిఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి హాట్ కామెంట్స్



2లో

## బిఆర్ఎస్ బాటలోనూ కాంగ్రెస్



3లో

రునమాఫీని పూర్తిస్థాయిలో చేయకపోవడం దారుణం

పద్దులపై చర్చలో బిజెఎల్‌పి నేత మహేశ్వర్ రెడ్డి

# తెలంగాణ రైతులకు తీపి కబురు

**రెండో విడత రుణమాఫీ ప్రారంభం**

**లాంఛనంగా ప్రారంభించిన సిఎం రేవంత్**

**అర్హులకు లక్షన్నర రుణమాఫీ**

**కింద నిధులు విడుదల**


**6,40,223 మందికి**

**రూ.6190.01 కోట్లు నిధులు విడుదల**

**రైతుల ప్రయోజనమే**

**మా ప్రాధాన్యం అన్న సిఎం రేవంత్**

కాంగ్రెస్ రైతు పక్షపాతి అని.. ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసేందుకు ఏకకాలంలో రూ.31 వేల కోట్లు కేటాయించి దేశ చరిత్రలోనే కొత్త రికార్డు సృష్టించిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.



2లో

### రెండు విడతల్లో 17,75,235 మందికి రుణమాఫీ

రూ.12,224 కోట్ల జమ రాష్ట్రంలో మొదటి, రెండో విడతలకు కలిపి మొత్తం 17,75,235 మందికి రూ.12,224 కోట్ల మేరకు రుణమాఫీ చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. మొదటి విడతలో 11,34,412 మందికి రూ.6,034.96 కోట్లు రుణమాఫీ కాగా.. మంగళవారం రెండో విడతలో 6,40,823 మంది రైతుల రుణ ఖాతాల్లో రూ.6,190.01 కోట్లను జమ చేసినట్లు పేర్కొంది. రెండో విడత రుణమాఫీలోనూ నల్గొండ జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. ఈ జిల్లాలో మొదటి విడతలో 63,124 మందికి రూ.454.49 కోట్లు, రెండో విడతలో 51,515 మందికి రూ.514.26 కోట్లు కలిపి.. మొత్తం 1,37,430 మందికి రూ.984.34 కోట్లు మాఫీ అయ్యాయి. ఆ తర్వాతి స్థానంలో నాగర్‌కర్నూల్ జిల్లా ఉంది. ఈ జిల్లాలో మొదటి విడతలో 47,989 మందికి రూ.271.44 కోట్లు, రెండో విడతలో 32,406 మందికి రూ.312.43 కోట్లు కలిపి.. 80,395 మందికి రూ.583.87 కోట్లు మాఫీ అయ్యాయి.

# పెన్షన్ల జాప్యంపై సుప్రీం కోర్టు ఆగ్రహం



**న్యూఢిల్లీ:** పెన్షన్ల జాప్యంపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. వన్ ర్యాంక్ వన్ పెన్షన్ పథకం అమలు చేయకపోవడపై కేంద్రంపై సీరియస్ అయ్యింది. భారత సైన్యంలో రీటైర్డ్ రెగ్యులర్ కెప్టెన్‌లకు చెల్లించే కేంద్రం నిర్ణయం తీసుకోకపోవడంపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. వన్‌ర్యాంక్ వన్ పెన్షన్ చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైందని, ఈ ప్రక్రియలో ఏళ్ల తరబడి జాప్యం చేస్తోందని మండిపడింది. ఈ క్రమంలో కేంద్రానికి రెండు లక్షలు జరిమానా విధించింది. ప్రభుత్వానికి చివరి అవకాశం ఇచ్చిన సుప్రీం కోర్టు నవంబర్ 14లోగా సమస్యను పరిష్కరించాలని ఆదేశించింది. లేదంటే పెన్షన్ పెంపుపై తామే ఆదేశాలు ఇవ్వాల్సి వస్తుందని హెచ్చరించింది. పెన్షన్ విషయంలో దాఖలైన పిటిషన్లను జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఆర్ మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది.భారత సైన్యంలో రిటైర్డ్ రెగ్యులర్ కెప్టెన్లకు చెల్లించే పెన్షన్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకోకపోవడంపై భారత సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. 'వన్ ర్యాంక్ వన్ పెన్షన్' పథకం ప్రకారం పింఛను చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైందని, ఈ ప్రక్రియలో ఏళ్లతరబడి జాప్యం చేస్తోందని మండిపడింది. ఈ క్రమంలో కేంద్రానికి రూ.2 లక్షల జరిమానా విధించింది. ప్రభుత్వానికి చివరి అవకాశం ఇచ్చిన సర్వోన్నత న్యాయస్థానం.. నవంబర్ 14లోగా సమస్యను పరిష్కరించాలని ఆదేశించింది. లేదంటే పెన్షన్ పెంపుపై తామే ఆదేశాలు ఇవ్వాల్సి వస్తుందని హెచ్చరించింది. ఈ క్రమంలో ఏళ్లతరబడి ప్రభుత్వం ఓ నిర్ణయానికి రాకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

# బడ్జెట్‌లో రాష్ట్రాల పేర్లు లేకుంటే విస్మరించినట్లు కాదు

**కాంగ్రెస్ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఇలాగే ప్రస్తావించారు**

**అయినంత మాత్రాన విస్మరించినట్లు కాదు: నిర్మలాసీతారామన్**




**న్యూఢిల్లీ:** బడ్జెట్ ప్రసంగంలో 26 రాష్ట్రాల ఊసే లేదని, అంత మాత్రాన ఆ రాష్ట్రాలకు కేటాయింపులు జరపనట్లు కాదని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. బడ్జెట్ పై జరిగిన చర్చకు లోక్‌సభలో మంగళవారం ఆమె సమాధానమిచ్చారు. రెండు రాష్ట్రాలకే అధిక కేటాయింపులు చేశామనడం సరికాదన్నారు. భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఆర్థికవ్యవస్థ అని చెప్పారు. గతంలో యూపీఏ పాలనలో రాష్ట్రాకు కేటాయింపుల లెక్కలు వెల్లడించారు. వరుసగా మూడోసారి ఎన్డీయేకు అధికారం ఇచ్చిన ప్రజలకు ధన్యవాదాలని, ప్రధాని మోదీపై ప్రజలు మరోసారి విశ్వాసం ఉంచి అధికారం

ఇచ్చారన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై సభలో మాట్లాడిన వారితో పాటు బడ్జెట్ పట్ల ఆసక్తి కనబరిచిన సభ్యులందరికి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ధన్యవాదాలు తెలిపారు. బడ్జెట్లో లోక్‌సభలో జరిగిన చర్చకు మంగళవారం ఆమె బదులిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో ఈ ప్రభుత్వానికి వరుసగా మూడోసారి అధికారం కట్టబెట్టిన దేశ ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతున్నానని చెప్పారు. ప్రజలు తమ ప్రభుత్వంపై పెట్టుకున్న విశ్వాసాన్ని నిలుపుకుంటామని, నిలకడైన వృద్ధి రేటుతో ప్రజలే కేంద్రంగా విధానాలకు రూపకల్పన చేస్తామని తెలిపారు.

# శ్రీశైలంలోకి భారీగా వరదనీరు

**మరో రెండు గేట్లు ఎత్తిన అధికారులు**



శ్రీశైలం: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో శ్రీశైలం జలాశయానికి వరదనీరు పోటెత్తుతోంది. సోమవారం 3 గేట్లను 10 మీటర్ల మేర ఎత్తి.. నీటిని దిగువకు విడుదల చేసిన అధికారులు.. తాజాగా మరో రెండు గేట్లను ఎత్తారు. దీంతో మొత్తం 5 గేట్ల ద్వారా నీరు దిగువన ఉన్న నాగార్జున సాగర్‌వైపు ప్రవహిస్తోంది. మరోవైపు ఈ సుందర దృశ్యాన్ని వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో సందర్శకులు వస్తున్నారు. శ్రీశైలం జలాశయం స్పిల్ వే ద్వారా 1.35 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.4.27 లక్షల క్యూసెక్కులు కాగా. 2.21 లక్షల క్యూసెక్కులుగా ఉంది. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 882.7 అడుగులు ఉంది. గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 215.8 టీఎంసీలు కాగా.. ప్రస్తుత నీటి నిల్వ 202.9 టీఎంసీలుగా నమోదైంది.

# సిఎం రేవంత్‌తో నటుడు అర్జున్ భేటీ



**హైదరాబాద్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సినీ నటుడు అర్జున్ మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎంను శాలువాతో సత్కరించారు. సీఎం కూడా అర్జున్‌ను శాలువాతో సత్కరించారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసానికి వెళ్లి అర్జున్ కలవడంతో ఈ భేటీకి గల కారణాలపై సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. మర్యాదపూర్వక భేటీగానే చెబుతున్నప్పటికీ అనుకోకుండా ఇలా కలవడం..అసలు కారణం ఏంటనే ఆసక్తికర చర్చ సోషల్ మీడియాలో మొదలైంది. అయితే.. సినీ నటుడు అర్జున్ రాజకీయ ప్రముఖులను కలవడం కొత్తేం కాదు. గత జనవరిలో ప్రధాని నరేంద్ర మోదీ చెన్నై పర్యటనకు వెళ్లినప్పుడు కూతురిని వెంటబెట్టుకుని మరీ వెళ్లి ప్రధానిని అర్జున్ కలిశారు. అర్జున్ తన పెద్ద కుమార్తె ఐశ్వర్యకు జూన్ నెలలో ప్రేమ పెళ్లి చేసిన సంగతి తెలిసిందే. ఉమాపతిని అర్జున్ కుమార్తె ఐశ్వర్య ప్రేమించి పెద్దల అంగీకారంతో పెళ్లి చేసుకుంది. అర్జున్ కుటుంబంతో కలిసి చెన్నైలో నివాసం ఉంటున్నారు.

# తెలంగాణ రైతులకు తీపి కబురు

హైదరాబాద్: తెలంగాణ రైతులకు రేవంత్ సర్కార్ తీపి కబురు చెప్పింది. రైతు ప్రయోజనాలే కాంగ్రెస్ ప్రభుత్వానికి ముఖ్యమని, అందుకనే రుణమాఫీ చేశామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కార్పొరేట్ సంస్థల అధిపతులు బ్యాంకులను మోసం చేస్తున్నారన్న ఆయన.. గత పదేళ్లలో కార్పొరేట్ కంపెనీలు రూ.14 లక్షల కోట్లు ఎగవేశాయని చెప్పారు. కానీ, సాగుకోసం బ్యాంకుల నుంచి తెచ్చిన అప్పులు తిరిగి కట్టలేక రైతులు నానా అవస్థలు పడుతున్నారని అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం వాళ్ల రుణాలను మాఫీ చేస్తోందని చెప్పారు. రెండో విడత పంట రుణాల మాఫీ నిధుల విడుదల సందర్భంగా శాసనసభ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రేవంత్ మాట్లాడారు. అసెంబ్లీ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి రెండో విడత రైతు రుణమాఫీ నిధులు విడుదల చేశారు. ఇప్పటికే రూ.లక్ష ఉన్నవారికి రుణమాఫీ పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 6,40,223 మందికి రూ.6190.01 కోట్లు నిధులు విడుదల చేశారు. మూడో విడత కింద 17, 75, 235 మంది రైతులకు రూ.12,224.98కోట్లు విడుదల చేశారు. రాజకీయ ప్రయోజనం కాదు... రైతు ప్రయోజనం ముఖ్యమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రైతు సంతోషంగా ఉండాలని 6మే 2022న వరంగల్ రైతు డిక్లరేషన్ ప్రకటించామని.. గత ప్రభుత్వం 60నెలలు నాలుగు విడతల్లో రూ.లక్ష రుణమాఫీ కూడా పూర్తిచేయలేకపోయారని గుర్తు చేశారు. గత ప్రభుత్వం రూ.25వేల కోట్లు కూడా రుణమాఫీ చేయలేకపోయిందన్నారు. అప్పుల్లో కూరుకుపోయిన తెలంగాణ ప్రభుత్వం ఎలా రుణమాఫీ చేస్తుందని కొందరు మాట్లాడారని.. ఎట్టి పరిస్థితుల్లో రుణమాఫీ చేయాల్సిందేనని ప్రణాళికలు రచించాం.. నిధులు సేకరించామని తెలిపారు నిధుల సమీకరణ చేసి ఇవాళ రెండో విడతలో రూ.6,198కోట్లు ఆరున్నర లక్షల మందికి మేలు జరిగేలా చేస్తున్నామని.. ఇది మా చిత్తశుద్ధి, ఇది మా నిబద్ధత అని ప్రకటించారు. నెహ్రూ




ఆనాడు హరిత విప్లవం తీసుకు వచ్చారని.. జై జవాన్, జై కిసాన్ నినాదంతో ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్లిందని రేవంత్ తెలిపారు. పేద రైతులకు తక్కువ వడ్డీకి రుణాలు అందించేందుకు ఇందిరమ్మ బ్యాంకుల జాతీయకరణ చేశారని.. సోనియమ్మ నేతృత్వంలో ఆనాడు ఆహార భద్రత చట్టం తీసుకువచ్చారని తెలిపారు. ఆనాడు రూ.72వేల కోట్లు రుణాలు మాఫీ చేసి దేశంలో రైతులను ఆదుకుంది కాంగ్రెస్ అని గుర్తు చేశారు. అప్పుడు .. ఇప్పుడు ఎప్పుడూ కాంగ్రెస్ రైతు పక్షపాతేనన్నారు. నెల తిరిగేలోగా 1.5లక్షల వరకు రైతు రుణమాఫీ చేసి మా చిత్తశుద్ధి నిరూపించుకున్నామని.. అగస్టులోగా రూ.2లక్షల రుణమాఫీ పూర్తి చేసి రైతులను రుణ విముక్తులను చేస్తామన్నారు. జూలై, ఆగస్టు నెలలు చరిత్రలో లిఖించదగ్గ నెలలు. దేశ చరిత్రలోనే తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీ రికార్డు సృష్టించిందన్నారు. స్వతంత్ర భారతంలో ఇప్పటి వరకు ఏ రాష్ట్రం కూడా ఇంత పెద్దమొత్తంలో రైతు రుణమాఫీ చేయలేదని.. గత బీఆరెస్ ప్రభుత్వం చేసిన అప్పులకు ఈ ఆరునెలల్లో ఆర్థిక మంత్రి రూ.43 వేల కోట్లు వడ్డీ చెల్లించారని ఆరోపించారు.

# హోంమంత్రి పదవి ఇస్తే..కాంగ్రెస్‌లో చేరుతా



హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి సంచలన కామెంట్స్ చేశారు. తాను కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధం అంటూ ..హోంమంత్రి పదవి ఇస్తూ చేరుతాను అంటూ బహిరంగంగానే ప్రకటించారు. అసెంబ్లీ లాబీలో మాజీ మంత్రి మల్లారెడ్డి మీడియాతో చిట్ చాట్‌లో మాట్లాడారు. ఎప్పటి నుంచి ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నట్లు వార్తలు గుప్పుమంటున్నాయి. ఏనాడూ ఆయన ఈ వార్తలను ఖండించిన దాఖలాలు కూడా లేవు. పార్టీ మారే అంశంపై బహిరంగంగానే ప్రకటించేశారు. తనకు హోంమంత్రి పదవి ఇస్తే కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు మల్లారెడ్డి ప్రకటించారు. మరి ఇందుకు సీఎం అంగీకరిస్తారా? అని కూడా మల్లారెడ్డి సందేహం వ్యక్తం చేశారు. వందశాతం సీఎం తనను రానివ్వడని కూడా అన్నారు. తనను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే మధ్యవర్తిత్వం చేయాలని జర్నలిస్టులను సైతం కోరారు. హోంమంత్రి పదవి ఇచ్చేటట్లు సీఎంతో మాట్లాడాలని జర్నలిస్టులను మల్లారెడ్డి కోరారు. బీఆర్ఎస్ ముచ్చటగా మూడోసారి గెలిస్తే తన ప్లేస్ వేరే లెవెల్‌లో ఉంటుండేనని అన్నారు. తాము మూడోసారి గెలిస్తే ఖచ్చితంగా హోంమంత్రి అవుతుండేనని అన్నారు.

'బీఆర్ఎస్ మూడోసారి గెలిస్తే.. రాష్ట్ర హోంమంత్రి అవుతుండే. సంవత్సరానికి నాలుగు సినిమాలు తీసేవాడిని. కొత్త శాటిలైట్ ఛానెల్ పెట్టేవాడిని. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో హోంమంత్రి పదవి సీఎం దగ్గర ఉంది. శాసనసభలో నన్ను ఎవరూ టచ్ చేయడం లేదు. నన్ను టచ్ చేస్తే ఒక్కొక్కరి సంగతి చెప్తాను. అప్పటి దాకా నా నోటికి తాళం వేసుకుని ఉంటాను. నా ఇంట్లో ఇన్‌కమ్ ట్యాక్స్ తనిఖీలు చేసిన అధికారులే షాక్ అయ్యారు. ఒక్క రూపాయి కూడా ఐటీ వాళ్లకు దొరకలేదు. డబ్బులు ఏమయ్యాయి అని నోరెళ్లబెట్టారు. ఇండియాలో మల్లారెడ్డి ఒక్కడే ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారిపై ఎఫ్ఐఆర్ చేయించింది. ఒక అధికారిపై కేసు పెట్టాలంటే దమ్ము ఉండాలి.' అని చెప్పారు మల్లారెడ్డి.

# జార్ఖండ్‌లో పట్టాలు తప్పిన హౌరా



**రాంచీ:** జార్ఖండ్‌లోని సెరైకెలా-ఖారవాన్ జిల్లాలో మంగళవారం తెలవారుజామున హౌరా-ముంబై మెయిల్‌కు చెందిన 18 బోగీలు పట్టాలు తప్పడంతో ఇద్దరు ప్రయాణికులు మరణించగా మరో 20 మంది గాయపడ్డారు. ఆగ్నేయ రైల్వేలోని చక్రధర్‌పూర్ డివిజన్ పరిధిలోకి వచ్చే బారాబంబూ సమీపంలో తెల్లవారుజామున 3.45 గంటలకు ఈ ప్రమాదం జరిగినట్లు రైల్వే అధికారులు తెలిపారు. జంషెడ్‌పూర్‌కు 80 కిలోమీటర్ల దూరంలో ఈ ఘటన జరిగింది. సమీపంలోనే మరో గూడ్సు రైలు కూడా పట్టాలు తప్పిందని, అయితే ఈ రెండు ప్రమాదాలు ఒకేసారి జరిగిందీ లేనిదీ తెలియరాలేదని ఆగ్నేయ రైల్వే అధికార ప్రతినిధి ఓం ప్రకాష్ చరణ్ విలేకరులకు తెలిపారు. హౌరా-ముంబై మెయిల్ ప్రమాదంపై దర్యాప్తునకు రైల్వే ఆదేశించినట్లు ఆయన చెప్పారు. బారాబంబూ సమీపంలో హౌరా-ముంబై మెయిల్‌కు చెందిన 18 బోగీలు పట్టాలు తప్పడంతో ఇద్దరు వ్యక్తులు మరణించారని, మరో 20 మంది ప్రయాణికులు గాయపడ్డారని పశ్చిమ సింగ్‌భం డిప్యూటీ కమిషనర్ కుల్దీప్ చౌదరి ప్రమాద స్థలి వద్ద విలేకరులకు తెలిపారు. హౌరా-ముంబై మెయిల్ ఆగి ఉన్న గూడ్సు రైలును ఢీకొందని ఆయన వెల్లడించారు. క్షతగాత్రులకు బారాబంబూలో ప్రాథమిక చికిత్స అందచేసి మెరుగైన చికిత్స కోసం చక్రధర్‌పూర్‌కు తరలించినట్లు రైల్వే అధికారి ఒకరు తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియాను రైల్వే శాఖ ప్రకటించింది. తీవ్రంగా గాయపడిన వారికి రూ. 5 లక్షలు, స్వల్పంగా గాయపడిన వారికి రూ. 1 లక్ష చొప్పున పరిహారాన్ని ప్రకటించినట్లు చక్రధర్‌పూర్ సీనియర్ డిసిఎం తెలిపారు. సహాయక చర్యలు పూర్తయినట్లు అధికారులు తెలిపారు.

# తిరిగి భారాసలోకి గద్వాల ఎమ్మెల్యే?



హైదరాబాద్: రాష్ట్ర రాజకీయాల్లో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి... శాసనసభలోని ప్రతిపక్ష నేత కేసీఆర్ కార్యాలయంలో మంగళవారం భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా భారాస ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, గంగుల కమలాకర్, జగదీశ్‌రెడ్డి, పద్మారావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, ప్రశాంత్‌రెడ్డి, డాక్టర్ సంజయ్, కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, కౌశిక్‌రెడ్డి తదితరులు ఆయన్ని సాదరంగా లోనికి ఆహ్వానించారు. కేటీఆర్‌తో పలు అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. త్వరలోనే కేసీఆర్‌ను కలుస్తానని కృష్ణమోహన్‌రెడ్డి చెప్పినట్లు తెలిసింది. ఈ సందర్భంగా... గద్వాల ఎమ్మెల్యే తిరిగి భారాస గూటికి చేరనున్నట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్‌లో చేరిన అనంతరం స్థానికంగా ఆ పార్టీ నేతలతో ఎమ్మెల్యేకు సమస్యలు ఎదురయ్యాయని తెలుస్తోంది. గద్వాల కాంగ్రెస్ నాయకులు కొందరు కృష్ణమోహన్‌రెడ్డి చేరికను బహిరంగంగానే వ్యతిరేకించారు కూడా. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్‌తో సమన్వయం లోపించి... కొంతకాలంగా అసంతృప్తిగా ఉన్న ఎమ్మెల్యే తాజాగా భారాసలోనే కొనసాగాలని నిర్ణయించుకున్నట్లు ఆ పార్టీ ముఖ్యనేత ఒకరు తెలిపారు. భారాసను వీడిన మరికొందరు ఎమ్మెల్యేలు కూడా తిరిగి సొంత గూటికి చేరతారని ఆ పార్టీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

# సరయూనదిలో పడి యువతి మృతి

## జనగామకు చెందిన తేజస్వినిగా గుర్తింపు

జనగామ:: అయోధ్యలోని సరయూ నదిలో జనగామకు చెందిన యువతి గల్లంతయ్యింది. కేంద్రానికి చెందిన తాళ్లపల్లి నాగరాజు, అతని సోదరుడి కుటుంబానికి చెందిన 15 మంది రెండురోజుల కిందట అయోధ్యకు వెళ్లింది. రామ మందిరంతో సహా స్థానిక ఆలయాలను సందర్శించారు. సోమవారం ఉదయం 8 గంటలకు నదీ స్నానం చేసేందుకు సరయూ నదిలో లక్ష్మణ్ ఘాట్‌కు వెళ్లారు. అయితే, భారీ వర్షాల నేపథ్యంలో పై నుంచి ఒక్కసారిగా వరద నీటిని వదలడంతో ఘాట్‌పై వరకు వరద ఉప్పొంగింది. దాంతో ఒక్కసారిగా ఐదుగురు నీటిలోపడిపోయారు. ఇందులో నలుగురు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. ఇందులో తేజస్విని అనే యువతి మాత్రం వరద నీటిలో కొట్టుకుపోయింది. ఇప్పటి వరకు బాలిక ఆచూకీ దొరకలేదని కుటుంబీకులు వాపోయారు. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ దృష్టికి తీసుకెళ్లగా.. యూపీ అధికారులతో మాట్లాడినా ఫలితం లేకుండాపోయింది. బాలిక ఆచూకీ కోసం కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. బాలిక జాడ కోసం లక్ష్మణ్ ఘాట్ వద్దే పడిగాపులు పడుతున్నారు. తేజస్విని స్థానిక ఏబీవీ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నది.

# ప్రేమపేరుతో అత్యాచారం వ్యక్తిని అరెస్ట్ చేసిన పోలీసులు

**హైదరాబాద్:** ప్రేమ పేరుతో ఓ యువతిని మోసం చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి అత్యాచారానికి ఒడిగట్టిన నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన యువతికి హైదరాబాద్‌లో ఉంటున్న స్వామి అనే వ్యక్తితో ఫేస్‌బుక్‌లో పరిచయం ఏర్పడింది. ఇద్దరి మధ్య చనువు పెరగడంతో ఆస్ట్రేలియా వెళు _న్నట్లు నమ్మించిన స్వామి.. ఆమెను హైదరాబాద్‌కు రప్పించాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. తనను పెళ్లి చేసుకోవాలని యువతి అడగడంతో ఆస్ట్రేలియా వెళ్లేందుకు ప్రయత్నించగా.. అతడి ప్రవర్తన పట్ల అనుమానం వచ్చిన యువతి పోలీసులను ఆశ్రయించింది. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని శంషాబాద్ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్నారు.

# గద్దర్ అవార్డులకు మేం సుముఖం

**హైదరాబాద్:** విశ్వంభర అవార్డు ప్రదానోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై సినీనటుడు చిరంజీవి స్పందించారు. సినిమా అవార్డులను పునరుద్ధరిస్తూ సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. గద్దర్ అవార్డులు ఇవ్వాలని తీసుకున్న నిర్ణయానికి ధన్యవాదాలు అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదనను ఫిలిం ఛాంబర్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. సోమవారం హైదరాబాద్ లో జరిగిన విశ్వంభర అవార్డుల ప్రదానోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ .. గద్దర్ అవార్డులపై రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనను టాలీవుడ్ స్పందించలేదని అన్నారు. ప్రతి యేటా జనవరిలో అందించే నంది అవార్డులను గద్దర్ అవార్డులతో భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కొత్త కార్యక్రమాన్ని అమలు చేయాలనేదానిపై సూచనలు చేయాలని టాలీవుడ్ ను కోరారు సీఎం రేవంత్ రెడ్డి.. అయితే సినీ పరిశ్రమ మౌనంగా ఉంది. సినీ పరిశ్రమ పెద్దలనుంచి ఎలాంటి స్పందన లేకపోవడం బాధాకరం అన్నారు సీఎం రేవంత్ రెడ్డి. ఎట్టకేలకు సినీనటుడు చిరంజీవి స్పందించారు. అవార్డులను పునరుద్ధరిస్తూ సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నా మన్నారు. గద్దర్ అవార్డులు ఇవ్వాలని తీసుకున్న నిర్ణయానికి ధన్యవాదాలు అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదనను ఫిలిం ఛాంబర్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ముందుకు తీసుకెళ్లాలని సూచించారు చిరంజీవి.

# స్కిల్ యూనివర్సిటీతో యువతకు నైపుణ్యాలు

హైదరాబాద్: స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు ద్వారా యువతకు అధునాతన పరిజ్ఞానం అందించడంతో పాటు నైపుణ్యాలను పెంపొందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా కొడంగల్‌లో ఏర్పాటు చేయనున్న స్కిల్ యూనివర్సిటీ బిల్లును మంగళవారం ఆయన శాసనసభలో ప్రవేశపెట్టారు. ఇది ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో ఏర్పాటు కానుంది. ఈ యూనివర్సిటీ ద్వారా రాష్ట్రంలో ఆర్థికాభివృద్ధితో పాటు ఉద్యోగ కల్పన దిశగా సర్కారు ముందడుగు వేసిందని మంత్రి అన్నారు. నైపుణ్య విశ్వవిద్యాలయాన్ని ఆర్థిక ప్రణాళికల వ్యూహాత్మక పెట్టుబడిగా శ్రీధర్‌బాబు అభివర్ణించారు.


# బిఆర్ఎస్ కొత్త డ్రామాలకు తెర




పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు..తిరిగి సొంతగూటికి చేరుతున్నారని వస్తున్న వార్తలపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పందించారు. చాంబర్ కు వెళ్లినంత మాత్రానా పార్టీలో చేరినట్లా అని ప్రశ్నించారు. కేటీఆర్ కూడా నా చైర్ దగ్గరకు వచ్చి మాట్లాడారా?. ఆయన కాంగ్రెస్ లో చేరినట్లేనా అని అన్నారు. బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి అలాగే కలిసి ఉంటాడు.. ఆయన ఎక్కడికి వెళ్లడు అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గట్టిగా చెప్పారు. జగదీష్ రెడ్డి నేను అన్న మాటలకు ఒప్పుకున్నారు.. సీఎంరేవంత్ రెడ్డి ఫారిన్ వెళ్లే నేను ఉన్నాగా చూసుకోవడానికి .. బీఆర్ ఎస్ నేతలకు నేను చాలు అని వార్నింగ్ ఇచ్చారు. త్వరలో ప్రధానిని కలుస్తా.. రాష్ట్ర రహదారుల కోసం నిధులు అడుగుతా అన్నారు. బీఆర్ ఎస్ ఎత్తేసిన అన్ని వ్యవసాయ పనిముట్లను సబ్సిడీ ఇస్తామన్నారు. ఉప్పల్- నారపల్లి ఫ్లై ఓవర్ కు త్వరలోనే రీ టెండర్ పిలుస్తామన్నారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. వర్షాకాలంలో ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా రోడ్డు మరమ్మత్తు పనులు చేపడతామన్నారు. ఎస్ ఎల్ బీసీ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. అసెంబ్లీలో ప్రతిపక్ష పాత చాలా కీలకమైనది.. కేసీఆర్ అసెంబ్లీకి రానప్పుడే ఆ పార్టీపై ఆశలు వదులుకున్నారు. కేసీఆర్ కు ప్రజలమీద ప్రేమ లేదన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు ముగ్గురు కలిసి రేవంత్ రెడ్డిని ఓడించలేకపోయారు అని అన్నారు. ఎమ్మెల్యేలు ఎవరు బీఆర్ఎస్ వైపు వెళ్లడం లేదని విప్ ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో చిట్ చాట్ చేశారు. బీఆర్ఎస్ నేతలు కావాలని ప్రచారం చేసుకుంటున్నారని మండిపడ్డారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్‌కు అక్కడి స్థానిక పరిస్థితులు ఎలా ఉన్నాయో తెలియదని అన్నారు. బీఆర్ఎస్ కావాలనే లీక్‌లు ఇస్తుందని చెప్పారు. కాంగ్రెస్‌లోకి వచ్చిన అందరూ ఎమ్మెల్యేలు పార్టీలోనే ఉంటారని.. బీఆర్ఎస్ నుంచి ఇంకా ఎమ్మెల్యేలు వస్తారని ఆది శ్రీనివాస్ తేల్చిచెప్పారు. తాను కచ్చితంగా మంత్రిని అవుతానని కాంగ్రెస్ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఏ శాఖకు మంత్రి అవుతాననేది మాత్రం చెప్పలేనని అన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచి గెలిచిన ఏకైక ఎమ్మెల్యేను తానని గుర్తుచేశారు. తనకు మంత్రి పదవి రాకుండా ఎలా ఉంటుందని ప్రశ్నించారు. మంగళవారం నాడు మీడియాతో చిట్ చాట్ చేశారు. రాష్ట్ర జనాభాలో 40శాతం జనాభా హైదరాబాద్ రంగారెడ్డి జిల్లాల్లో ఉన్నారని స్పష్టం చేశారు. తనకు మంత్రి పదవి ఇవ్వకపోతే హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలను విస్మరించినట్లేనని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. ఇదిలావుంటే బిఆర్ఎస్ పార్టీలో బి తొలగించి

తిరిగి టి పెట్టే దమ్ముందా అని మాజీ మంత్రి కేటీఆర్‌కు మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సవాల్ విసిరారు. డిఎంకె, టిఎంసి లాంటి పార్టీలకు ఒక ఫిలాసఫీ ఉందని బీఆర్ఎస్‌కి ఏ ఫిలాసిఫీ ఉందని ప్రశ్నించారు. అధికారం ఉన్నపుడే బీఆర్ఎస్ కాంగ్రెస్‌ను ఏం చేయలేకపోయిందని.. ఇప్పుడేం చేస్తారని అన్నారు. గద్వాల ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డికి ఓపిక లేదని.. నియోజకవర్గంలో ఆయన చెప్పినట్లు పార్టీ యావత్ ప్రాధాన్యం ఇచ్చిందని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆయన మనుషులకు అవకాశాలు ఉండాలి అని అడిగారని.. దానికీ కుడా సరే అన్నామని చెప్పారు. జిల్లాలో బీసీ మహిళా అయిన జెడ్పీ చైర్మన్‌ను ఎక్కడికి రావొద్దన్నారని.. ఆమెను అధికార కార్యక్రమాలకు పిలవద్దు అన్నారని ఇది సాధ్యం కాదని తేల్చి చెప్పామని అన్నారు. మంగళవారం నాడు శ్రీనివాస్ రెడ్డి మీడియాతో చిట్ చాట్ చేశారు.

వేగుచుక్క
TELUGU DAILY NEWS
3
బుధవారం 31 జులై 2024





# బిఆర్ఎస్ బాటలోనూ కాంగ్రెస్

**హైదరాబాద్:** రైతులందరికీ రుణ మాఫీ చేయనందుకే బిఆర్ఎస్ అక్కడ కూర్చొందని, ఇప్పుడు అదే బాటలో కాంగ్రెస్ నడవటం బాధాకరమని బిజెఎల్పి నేత ఏలేటి మహేశ్వర రెడ్డి అన్నారు. మంగళవారం శాసనసభలో పద్దులపై జరిగిన చర్చలో ఆయన పాల్గొంటూ రుణ మాఫీకి 30 వేల కోట్లకు పైగా బ్జడెట్ అవసరమని, కాని అంత బ్జడెట్ రుణమాఫీకి కేటాయించలేదని తెలిపారు. ముఖ్యమంత్రి చెప్పిన లెక్కల ప్రకారం 70 లక్షల మంది రైతులు తెలంగాణలో ఉన్నారని, కాని ఇందులో కోత విధించినట్లు తెలుస్తోందన్నారు. ఏ ప్రాతిపాదికన రైతులను ఎంపిక చేశారని ఆయన ప్రశ్నించారు. వరంగల్ సభలో ఎటువంటి నిబంధనలు లేకుండా రుణమాఫీ చేస్తామని ఒప్పుకున్నారని, మెలికలు లేకుండా రుణమాఫీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఏడాది రైతు బంధు పడలేదని, సీజన్ రైతు బంధు విడుదల చేయాలని కోరారు. రైతు బందుకు , రైతు భరోసా కు వేర్వేరు నిధులు కేటాయించాలన్నారు. రైతు భరోసాపై అసెంబ్లీ లో చర్చ పెడతామని ముఖ్యమంత్రి చెప్పారని, చర్చ ఎప్పుడు పెడతారో చెప్పాలని కోరారు. కౌలు రైతుల గోస పట్టించుకునే నాథుడే లేరని, తెలంగాణలో దాదాపు 15 లక్షల కౌలు రైతు లు ఉన్నారని, వారు మీరిచ్చిన హామీతో మీకు ఓటేశారని మహేశ్వర్ రెడ్డి అన్నారు. కౌలు రైతు లకు ఇస్తామన్న పెట్టుబడి సహాయం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. పంట బోనస్ రూ. 500 ఇవ్వాలని, ఎన్నికల హామీలు భారేడు నిధులు మాత్రం జానెడు అనే విధంగా ఉందన్నారు.

# టీయూ దక్షిణ ప్రాంగణంలో జాబ్ మేళా.

## - 9 మంది జియో ఇన్ఫర్మేటిక్స్ విద్యార్థుల ఎంపిక.







**వేగుచుక్క న్యూస్, భిక్నూర్, జులై 30**

తెలంగాణ విశ్వవిద్యాలయ దక్షిణ ప్రాంగణంలో మంగళవారం జాబ్ మేళా నిర్వహించారు. దీనిలో టీయూకి చెందిన 9 మంది జియో ఇన్ఫర్మేటిక్స్ విద్యార్థులు ఎంపిక అయ్యారు.తెలంగాణ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్స్ లర్, రిజిస్ట్రార్ ల ఆదేశానుసారం విశ్వవిద్యాలయంలో గతంలో పీజీ పూర్తి చేసుకున్న, పీ.జీ. ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు తెలంగాణ విశ్వవిద్యాలయం ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ సెల్, డిపార్ట్మెంట్ ఆఫ్ జియో ఇన్ఫర్మేటిక్స్ విభాగం సంయుక్తంగా జాబ్ మేళా నిర్వహించారు. జాబ్ మేళాలో క్రైనోస్ జియో స్పెషల్ టెక్నాలజీ లిమిటెడ్ హైదరాబాద్ వారు నిర్వహించిన క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్ లో జియో స్పేయల్ డేటా ఎనలిస్ట్ ఉద్యోగాల కోసం క్యాంపస్ ప్లేస్ మెంట్ డ్రైవ్ లో 35 మంది రిజిస్టర్ చేసుకోగా వ్యక్తిగత పరిచయ రౌండ్గ్రూప్ డిస్కషన్, ముఖాముఖి పరిక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 9 మంది జియో ఇన్ఫర్మేటిక్స్ విద్యార్థులు ఎంపిక చేయబడ్డారు.. కంపెనీ ప్రతినిధులుగా డి.వి.యస్. శర్మ, ఎం అజయ్ కుమార్ ఇంటర్వ్యూలను నిర్వహించారు.ఈ సందర్భంగా క్యాంపస్ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ అధికారి డాక్టర్ పాత నాగరాజు మాట్లాడుతూ, రానున్న రోజులలో ప్రైవేటు రంగంలో ఉద్యోగాలకు అత్యధిక డిమాండ్ ఉంటుందని అన్నారు. జియో ఇన్ఫర్మేటిక్స్ విద్యార్థులను అభినందిస్తూ ఆదర్శంగా నిలిచారన్నారు. రానున్న కాలంలో మరిన్ని కంపెనీలతో మాట్లాడి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని, విద్యార్థులు సిద్ధంగా ఉండాలని అన్నారు. దక్షిణ ప్రాంగణ ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ సుధాకర్ గౌడ్ మాట్లాడుతూ, జియో ఇన్ఫర్మేటిక్స్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, మరింత కష్టపడాలని సూచించారు.ఎంపికైనా విద్యార్థులను రిజిస్ట్రార్ ఆచార్య యం. యాదగిరి, ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ సుధాకర్ గౌడ్, జియో ఇన్ఫర్మేటిక్స్ హెడ్ డాక్టర్ కవిత తురన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్స్ డాక్టర్ టి. ప్రతిజ్ఞ, డాక్టర్ ఎస్. నారాయణ, డాక్టర్ డి. సవిత పాల్గొన్నారు.

# అభివృద్ధికి నిధులు ఇవ్వండి.

## - సిఎం కు నిజమాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ వినతి.

**వేగుచుక్క న్యూస్, హైదరాబాద్**



తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ సమావేశాలలో పాల్గొంటున్నా నిజమాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా మంగళవారం ముఖ్యమంత్రి ఛాంబర్ లో సిఎం రేవంత్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. అర్బన్ నియోజకవర్గ సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళారు. నిజామాబాద్ అర్బన్ లో రోడ్స్ ,డ్రైనేజీ అస్తవ్యస్థంగా ఉన్నాయని, తాగునిటీ సమస్య, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ తదితర అంశాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డీతో చర్చించారు. ఎస్ డిఎఫ్ ఫండ్ పది కోట్లు వెంటనే విడుదల చేయాలనీ ముఖ్యమంత్రిని కోరారు. దానికి సిఎం సానుకూలంగా స్పందించడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు.

# రోడ్డు ప్రమాద బాధితులకు అండగా వినయ్ రెడ్డి.

**వేగుచుక్క న్యూస్, ఆర్మూర్, జులై 30:**



మాక్లూర్ మండలం రామస్వామి క్యాంప్ కు చెందిన అరుణ్, దీప దంపతులు డీఎస్సీ పరీక్ష కోసం కారులో సిద్ది పేట వెళ్తుండగా రామాయంపేట వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో దంపతులు తీవ్రంగా గాయపడగా.. విషయం తెలుసుకున్న ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి వినయ్ రెడ్డి వెంటనే స్పందించారు. బాధితులను అమీర్ పేట్ లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి, వారికి అండగా నిలిచారు. వినయ్ రెడ్డి ఆస్పత్రికి వెళ్లి వారిని పరామర్శించి, మెరు గైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

# మున్సిపల్ కమిషనర్ కు సమ్మె నోటీస్.

## - కనీస వేతనాలు ఇవ్వాలని బిఎల్ టియూ డిమాండ్.

**వేగుచుక్క న్యూస్, నిజమాబాద్, జులై 30**



మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పనిచేస్తున్న కార్మికులకు GO.NO 60 ప్రకారం కనీస వేతనం రూ: 19,500 ఇవ్వాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయ్ యూనియన్ (బిఎల్ టియూ) జిల్లా అధ్యక్షులు దండి వెంకట్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కమిషనర్ మకరంద్ కు సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా దండి వెంకట్ మాట్లాడుతూ, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న వాటర్ సప్లయ్, స్ట్రీట్ లైట్స్, గార్డెన్, ఫిల్టర్ బెడ్స్ లలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులకు
%+ూ.చీూ% 60 ప్రకారం కనీస వేతనం రూ: 19,500 ఇవ్వాల్సి ఉండగా, రూ: 16500 వేతనం అమలు చేస్తున్నారని అన్నారు.
%+శీ.చీూ%. 60 ప్రకారం కనీస వేతనం ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తూ గత సంవత్సర కాలంగా మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కు అనేక వినతిపత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఇదే విషయాన్ని జిల్లా కలెక్టర్, లేబర్ కమిషనర్, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కు, మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ లకు వినతిపత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు. అయినా సరే మున్సిపల్ కార్పొరేషన్ నుండి కనీస స్పందన రాకపోవడంతో, కార్మిక చట్టాలను అనుసరించి చట్టబద్ధంగా సమ్మె నోటీస్ ఇవ్వాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయ్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం నిర్ణయించిందన్నారు. ఈ సమ్మె నోటీస్ ఇచ్చిన 15 రోజుల లోపు కార్మికులకు కనీస వేతనం రూ: 19,500 అమలు చేస్తున్నట్లు ప్రకటించకపోతే ఆగస్టు మొదటి వారంలో ఎప్పుడైనా కార్మికులు సమ్మెలోకి వెళ్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్స్ జిల్లా ఉపాధ్యక్షులు సబ్బని లత, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయ్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్, నాయకులు రాహుల్, మురళి, వసంత్ పాల్గొన్నారు.

# సిఎం అపాయింట్మెంట్ ఇస్తే మాట్లాడుతాం

## గద్దర్ అవార్డులపై తమ్మారెడ్డి భరద్వాజ

**హైదరాబాద్:** నంది అవార్డులను గద్దర్ అవార్డులుగా మార్చుతామని గతంలో సిఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ప్రముఖ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ స్పందించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తాము సిఎం రేవంత్ రెడ్డి అపాయింట్మెంట్ కోసం ప్రయత్నించామని రెండు, మూడుసార్లు అపాయింట్మెంట్ కోసం అడిగామని కానీ, ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదన్నారు. సిఎం రేవంత్ అపాయింట్మెంట్ ఇస్తే వెళ్లి మాట్లాడటానికి రెడీగా ఉన్నామని ఆయన తెలిపారు. గద్దర్ గొప్ప వ్యక్తి ఆయన పేరుమీద అవార్డులు తీసుకోవడానికి ఎవరికీ అభ్యంతరం లేదని ఆయన ప్రకటించారు. కాగా, అంతకుముందు గద్దర్ అవార్డులపై రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు తెలుగు చిత్ర పరిశ్రమ స్పందన లేకపోవడంపై సిఎం రేవంత్ రెడ్డి అసంతృప్తికి లోనయ్యారు. సోమవారం సాయంత్రం సినారె జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన అవార్డుల కార్యక్రమంలో సిఎం రేవంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సినీ పరిశ్రమపై తొలిసారి అసంతృప్తి వెళ్లగక్కారు. ఈ ఏడాది జనవరిలో నంది అవార్డులను గద్దర్ అవార్డులుగా మారుస్తామని ఆయన ప్రకటించారు. గద్దర్ అవార్డుల కార్యక్రమాన్ని ఎలా అమలు చేయాలన్న దానిపై అభిప్రాయాలు, సూచనలు అందించాలని మరోసారి పరిశ్రమ పెద్దలకు సూచనలు చేశారు.

# కృష్ణమ్మ ఒడిలో సంగమేశ్వరాలయం

### ఏటా వర్షాకాలంలో నీట మునగడం ఆనవాయితీ



**కర్నూలు:** పాండవులచే ప్రతిష్టించినట్లు ప్రచారం జరుగుతున్న సప్త నదుల సంగమేశ్వర స్వామి జలాదివాసం అయ్యారు. ఎగువన ఉన్న కర్ణాటక, మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణా నదికి వరద నీరు పోటెత్తుతోంది. సుమారు రెండు లక్షల క్యూసెక్కుల వరద నీరు వస్తుండటంతో సంగమేశ్వరం వద్ద కృష్ణమ్మ పరవళ్ళు తొక్కుతోంది. దీంతో నీటి మట్టం పెరగడంతో సంఘమేశ్వరాలయం లోని వేపదారు శివలింగమును కృష్ణా జలాలు తాకాయి . కర్నూలు జిల్లా నల్లమల అటవీ ప్రాంతంలోని లలితా సంగమేశ్వరుడు కృష్ణమ్మ ఒడికి చేరుకున్నాడు.
సంగమేశ్వరాలయం గత ఏడాది డిసెంబర్ 11వ తేదీ శ్రీశైల జలాశయం కృష్ణా జలాల్లో నుండి బయటపడింది. తిరిగి ఇప్పుడు జులై 23వ తేదీ ఆలయం ప్రాంగణంలో నీళ్లు వచ్చి స్వామి గర్భలయంలోకి ప్రవేశించాయి. దాదాపు 258 రోజులు పాటు భక్తులకు దర్శనమించిన వేపదారు శివలింగాన్ని కృష్ణ జలాలు తాకాయి. గంగమ్మకు చీర సారే సమర్పించి గర్భాలయంలోని వేపదారు శివలింగం కు ఈ సంవత్సరానికి చివరి పూజలు నిర్వహించిన ప్రత్యేక పూజలు చేశారు ఆలయ ప్రధాన అర్చకులు. గత సంవత్సరం జూలై 30వ తేదీ గర్భాలయంలోకి నీళ్లు రాగా డిశంబరు 11వ తేదీ ఆలయం బయటపడి భక్తులకు దర్శనమిచ్చిన సంగమేశ్వరుడు. డిసెంబర్ 11 నుండి నేటి వరకు దాదాపు 258 రోజులు పాటు భక్తుల పూజల అందుకున్నారు సప్త నదుల సంగమేశ్వరుడు. ప్రతి సంవత్సరం ఎనిమిది నెలలు నీళ్లల్లో ఉండి నాలుగు నెలలు మాత్రమే బయటపడే ఆలయం ఈసారి 8 నెలలు బయట ఉండడం విశేషం. మళ్ళీ స్వామి వారి దర్శనం ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 840 అడుగుల నీటిమట్టం ఉండగా ఈ నీటిమట్టం 85క్ష అడుగులకు చేరుకుంటే సంఘమేశ్వర ఆలయం పూర్తిగా కృష్ణమ్మ ఒడిలోకి వెళ్లనుంది. మళ్లీ స్వామి అమ్మవార్ల దర్శనం కలగాలంటే 8 నెలలు వేచిచూడాలి భక్తులు. సంగమేశ్వరాలయం ఆలయం విశేషం ఏమిటంటే.. ఈ ఆలయం ఎక్కువ రోజులు శ్రీశైలం ప్రాజెక్టు నీటిలో మునిగివుంటుంది. మరో విషయం ఏమిటంటే వేల సంవత్సరాల క్రితం సంగమేశ్వరాలయంలో ప్రతిష్టించిన వేపలింగంను భీముడు ప్రతిస్టించాడని పురాణాలు చెబుతున్నాయి. వేపదారు శివలింగం ఇప్పటికీ చెక్కుచెదరకపోవడం భక్తులను ఆశ్చర్యచకితులను చేస్తోంది.

# గాంధీనగర్‌లో భారీ చోరీ

## పట్టపగలే ఫ్లాట్ తాళాలు పగలగొట్టి దోపిడీ



**హైదరాబాద్:** నగరంలోని గాంధీనగర్ పీఎస్ పరిధిలో ఓ ప్లాట్‌లో చోరీ జరిగింది. ఓ ప్లాట్ తాళాలు పగలకొట్టి 50 తులాల బంగారు నగలు, లక్ష రూపాయల నగదును గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. గాంధీనగర్ పీఎస్ పరిధిలోని బన్సీలాల్ పేట్ కృష్ణానగర్‌లో శ్రీ షీలా రెవెన్యూ అపార్ట్‌మెంట్‌లో ఈ ఘటన జరిగింది. అపార్ట్‌మెంట్‌లోని మూడో అంతస్తులో ఉన్న 303 ప్లాట్లో పట్టపగలే ఈ చోరీ జరిగింది. బాధితుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు గాంధీనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గాంధీనగర్ పోలీసు క్లూస్ టీం గాంధీనగర్ చేరుకుంది. మరోపక్క చుట్టుపక్క ప్రాంతాల్లోని వారిని అడిగి పోలీసులు వివరాలు తెలుసుకుంటున్నారు. ఉదయం శ్రీనివాస్ ఉద్యోగం కోసం బ్యాంక్‌కు వెళ్లగా, అతడి భార్య తన తల్లి అనారోగ్యంతో బాధపడుతోందని చూసేందుకు పుట్టింటికి వెళ్లింది.శ్రీనివాస్ కూతురు కాలేజీకి వెళ్లింది. కాలేజీ నుంచి ఇంటికి వచ్చి చూసేసరికి తలుపులు పగలగొట్టి ఉన్నాయి. వెంటనే యువతి లోపలికి వెళ్లి చూసేసరికి బీరువా తాళాలు పగలగొట్టి ఉన్నాయి. వెంటనే యువతి డయల్ 100కి ఫోన్ చేసింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసుకున్న గాంధీనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# గద్దర్ అవార్డులపై టాలీవుడ్ మౌన్ సిఎం రేవంత్ రెడ్డి అసహనం

తెలుగు చలనచిత్ర పరిశ్రమ టాలీవుడ్ పై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గద్దర్ అవార్డులపై రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు తెలుగు చిత్ర పరిశ్రమ నుంచి స్పందన లేకపోవడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. ప్రతిష్టాత్మక నంది అవార్డులను గద్దర్ అవార్డులతో భర్తీ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఏడాది నిర్ణయాన్ని ప్రకటించింది. ఈ కొత్త కార్యక్రమాన్ని ఎలా సమర్థవంతంగా అమలు చేయాలనే దానిపై అభిప్రాయాన్ని, సూచనలను అందించాలని తెలుగు చిత్ర పరిశ్రమను సీఎం రేవంతరెడ్డి కోరారు. అయితే ఈ విషయంపై సినీ పరిశ్రమ మౌనంగా ఉందని ఆయన అన్నారు.ప్రముఖ తమిళ రచయిత, ఉద్యమకారుడు శివశంకరికి 'విశ్వంభర డాక్టర్ సి. నారాయణరెడ్డి జాతీయ సాహిత్య పురస్కారం' ప్రదానం సందర్భంగా రేవంత రెడ్డి కామెంట్స్ చేశారు. 'తెలుగు చిత్ర పరిశ్రమలో చేసిన కృషికి, విజయాలకు గౌరవంగా గద్దర్ అవార్డులను ప్రకటించాం. దీనిపై కార్యచరణ సిద్ధం చేయమని పరిశ్రమను కోరాం. సినీ పరిశ్రమ పెద్దల నుంచి ఎలాంటి స్పందన లేకపోవటం బాధాకరం' అని ముఖమంత్రి అన్నారు.





# రాయన్‌లో ఆకట్టుకున్న ధనుష్: మహేశ్ బాబు



ధనుష్ హీరోగా సందీప్ కిషన్, విజయ్ కాళిదాసు, దుషారా విజయన్, ఆపర్ణ బాలమురళి ప్రధాన పాత్రదారులుగా నటించిగా ఇటీవల థియేటర్లలో విడుదలై కలెక్షన్ల సునామీ సృష్టిస్తోన్న చిత్రం 'రాయన్' విడుదలైన మొదటి రోజు నుంచే పాజిటివ్ టాక్‌తో దూసుకెళుతున్నది. ఈ చిత్రాన్ని కథానాయకుడు ధనుష్ స్వయంగా రచన చేసి దర్శకత్వం వహించిన ఈ చిత్రంపై ప్రేక్షకుల నుంచే కాకుండా తెలుగు, తమిళ సినీ సెలబ్రిటీల నుంచి కూడా ఊహించని విధంగా రెస్పాన్స్ వస్తోంది. సినిమాను పొగుడుతూ తమ తమ సోషల్ మీడియా అకౌంట్లలో పోస్టులు పెడుతున్నారు.. తాజాగా టాలీవుడ్ సూపర్ స్టార్ మహేశ్ బాబు ఈ రాయన్ సినిమాను తిలకించి మూవీ గురించి తన అభిప్రాయాన్ని ఎక్స్ (ట్విట్టర్) వేదికగా తెలిపారు. రాయన్ సినిమా అసాంతం ధనుష్ తన నటనతో ఆకట్టుకున్నాడని అంతేగాక బ్రిలియంట్‌గా డైరెక్ట్ చేశాడని ప్రకాశ్ రాజ్, సందీప్ కిషన్, ఎస్జే సూర్య ఇతర నటీనటులు అదర్భుతంగా నటించారని, మ్యాస్ట్రో రెహమాన్ సంగీతం ఎలక్ట్రిఫైయింగ్ ఉందని ఇది ప్రతి ఒక్కరూ చూడాల్సిన సినిమా అంటూ చిత్రంపై పొగడ్తల వర్షం కురిపించారు. ÷ఖనికి ధనుష్ స్పందిస్తూ మీరు మా రాయన్ సినిమాను చూడడం ప్రశంసించడం హృదయాలను తట్టింది, మా టీమ్ అంతా థ్రిల్ ఫీలయ్యామని అన్నారు. ఎస్జే సూర్య మీ ట్వీట్ మాకు ఎంతో సపోర్టింగ్ ఉంది లవ్లీ ట్వీట్ లవ్ యూ బాబు గారు అంటూ రీ ట్వీట్ చేయగా సందీప్ కిషన్ , అపర్ణ బాల మురళిలు కృతజ్ఞతలు తెలిపారు.

# అక్షయ్ కుమార్ ..ఖేల్‌ఖేల్‌మే



బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్ ఇటీవలే సర్ఫీరా సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడని తెలిసిందే. ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద మంచి టాక్ తెచ్చుకుంది. ప్రస్తుతం అక్షయ్ కుమార్ ఖేల్ ఖేల్ సినిమాలో నటిస్తున్నాడు. ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు 15న గ్రాండ్‌గా విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా నుంచి రెండో సాంగ్ ను విడుదల చేశారు మేకర్స్. అక్షయ్‌కుమార్, వాణీకపూర్ కాంబినేషన్‌లో వచ్చే ఈ పాట ఫీల్ గుడ్ ఇంప్రెషన్‌తో సాగుతూ మ్యూజిక్ లవర్స్‌ను ఆకట్టుకుంటోంది.

# థగ్‌లైఫ్‌లోకి నాజర్, అభిరామి

కమల్‌హాసన్ హీరోగా మణిరత్నం తెరకెక్కిస్తోన్న చిత్రం 'థగ్ లైఫ్'. పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం రూపొందుతోంది. ఇప్పటికే ఇందులో బడా స్టార్స్ నటిస్తుండగా.. తాజాగా మరో ఇద్దరూ నటీనటులు ఈ ప్రాజెక్ట్‌లో భాగమయ్యారు. సీనియర్ నటుడు నాజర్, అభిరామి ఈ చిత్రంలో నటించనున్నట్లు తెలుపుతూ నిర్మాణ సంస్థలు రాజ్‌కమల్ ఫిల్మ్స్, మద్రాస్ టాకీస్ సంస్థలు పోస్టర్లు షేర్ చేశాయి. కమల్‌హాసన్ చిత్రంలో మరోసారి భాగం కావడం పట్ల ఎంతో ఆనందంగా ఉందని అభిరామి తెలిపారు. 2004లో ఆమె కమల్ హాసన్ సినిమా 'విరుమండీ'లో నటించారు. మళ్లీ 20 ఏళ్లకు ఆయన చిత్రంలో అవకాశం రావడం.. అదీ మణిరత్నం దర్శకత్వంలో చేస్తుండడం కలలా ఉందన్నారు. నిర్మాణ సంస్థ పోస్ట్‌ను రీ షేర్ చేసిన అభిరామి 'కలలు కనడం ఎప్పటికీ ఆపకండి? ఎందుకంటే ఏదో ఒకరోజు అవి నిజమవుతాయి' అని రాసుకొచ్చారు.ప్రస్తుతం ఆమె నాని హీరోగా తెరకెక్కుతోన్న 'సరిపోదా శనివారం'లోనూ నటిస్తోంది. థగ్‌లైఫ్ కథ విషయానికొస్తే.. సముద్రపు దొంగల నేపథ్యంలో యాక్షన్ డ్రామాగా ఈ చిత్రం రూపొందుతోంది. 'నాయకన్' లాంటి హిట్ తర్వాత కమల్‌హాసన్ – మణిరత్నం కాంబోలో 36 ఏళ్లకు వస్తోన్న సినిమా కావడంతో ప్రేక్షకుల్లో దీనిపై అంచనాలు భారీగా ఏర్పడ్డాయి. ఇందులో త్రిష కథానాయిక. అలీ ఫజల్, పంకజ్ త్రిపాఠీ, శింబు మలయాళ నటుడు జోజు జార్జ్, హీరో గౌతమ్ కార్తీక్, ఐశ్వర్య లక్ష్మి ఇందులో కీలక పాత్రలు పోషించనున్నారు. ఎ.ఆర్.రెహమాన్ స్వరకర్త.



# తంగలాన్ చిత్రీకరణలో చర్మ సమస్యలు




అనుభవనాలను వివరించిన మాళవికపా.రంజిత్ దర్శకత్వంలో చియాన్ విక్రమ్ హీరోగా తెరకెక్కిన 'తంగలాన్' చిత్రంలో నటించడం వల్ల చర్మ వ్యాధుల బారిన పడినట్టు మలయాళ బ్యూటీ మాళవిక మోహనన్ తెలిపారు. బడా నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా.. దర్శకుడు పా.రంజిత్ కు చెందిన నీలం ప్రొడక్షన్‌తో కలిసి ఈ చిత్రాన్ని భారీ బ్జడెట్‌తో తెరకెక్కించారు. కర్ణాటక రాష్ట్రంలోని కోలార్ బంగారు గనుల్లో పనిచేసే తమిళ కూలీల ఇతివృత్తంతో పీరియాడికల్ మూవీగా దర్శకుడు పా.రంజిత్ రూపొందించారు. ఈ సినిమా నిర్మాణంలో ఎదురైన అనుభవాలను మాళవిక మోహనన్ తాజాగా వివరించారు. 'ఈ మూవీలో వైవిధ్యభరితమైన పాత్రలో నటించాను. వేషధారణ కూడా అలాగే ఉంటుంది. ప్రతి రోజూ మేకప్ వేసుకునేందుకు కనీసం నాలుగు నుంచి ఐదు గంటల సమయం పట్టేది. ఎర్రటి ఎండల్లో ఈ సినిమా షూటింగ్ జరిగింది. సినిమా షూటింగ్ పూర్తయిన వెంటనే నేత్ర సమస్యలతో పాటు చర్మవ్యాధులతో ఇబ్బంది పడ్డాను. దీనికి కారణం.. మండిపోయే ఎండలు. పాత్ర కోసం వాడిన దుస్తులు. వేసిన మేకప్. దాదాపు ఐదారు మంది స్కిన్ స్పెషలిస్టుల (వైద్యులు)ను సంప్రదించాల్సి వచ్చింది' అంటూ మాళవిక మోహనన్ ఈ సినిమా చిత్రీకరణ సమయంలో తనకు ఎదురైన అనుభవాలను వివరించారు.

# తెలుగులో శ్రీలీల దూకుడు



తెలుగు నాట వరుస భారీ సినిమాలతో దూసుకుపోతోంది అచ్చ తెలుగు సోయగం శ్రీలీల ఈ యేడు గుంటూరు కారం సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ ముద్దగుమ్మ ఈమధ్య సినిమాలకు కాస్త గ్యాప్ ఇచ్చి తన ఎద్యుకేషన్ పూర్తి చేసే పనిలో నిమగ్నమైంది. ఈ క్రమంలో సెలవు లభించినప్పుడల్లా విహార యాత్రలు చేస్తోంది. ప్రైవేట్ కార్యక్రమాలలో ఎక్కువగా పాల్గొంటోంది. ÷ూజాగా శ్రీలీల ఓ మ్యాగ్జిన్ కోసం బంగారు వర్ణం డ్రెస్‌లో దర్శనమిచ్చి అహుతులను షాక్‌కు గురి చేసింది.ఇంతకుముందు కన్నా కాస్త గ్లామర్‌ను జత చేసి హోయలు పోతూ తన అభిమానులకు సరికొత్త ట్రీట్ ఇచ్చింది. ఇప్పుడు ఈ ఫొటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.

# తిరుమల కిషోర్ దర్శకత్వంలో రవితేజ



రవితేజ నటించిన 'మిస్టర్ బచ్చన్' సినిమా ఈ ఆగస్టు 15న విడుదలకి సిద్ధం అవుతోంది. హరీష్ శంకర్ దర్శకుడు, ఈ సినిమా అజయ్ దేవగన్ నటించిన హిందీ సినిమా 'ది రైడ్' సినిమాకి అనువాదం. ఈ సినిమా తరువాత రవితేజ దర్శకుడు గోపీచంద్ మలినేనితో సినిమా చెయ్యడానికి ఒప్పుకున్నారు. వారిద్దరి కాంబినేషన్ లో ఇది నాలుగో సినిమా. ఇంతకు ముందు వారిద్దరూ కలిపి 'డాన్ శీను', 'బలుపు', 'క్రేక్' సినిమాలు చేశారు. ఇప్పుడు వీరిద్దరూ కలిపి నాలుగో సినిమాకి శ్రీకారం చుట్టారు, ఇందులో శ్రీలీల కథానాయిక. ఈ సినిమా తరువాత రవితేజ ఇంకొక సినిమా కూడా ఒప్పుకున్నారని తాజా సమాచారం. 'నేను శైలజ' లాంటి మంచి విజయాన్ని అందించిన కిషోర్ తిరుమల ఈ సినిమాకి దర్శకుడిగా పని చేస్తారని తెలుస్తోంది. కిషోర్ తిరుముల చివరి సినిమా 'ఆడవాళ్ళు మీకు జోహార్లు', శర్వానంద్ ఇందులో కథానాయకుడు. ఇది 2022లో వచ్చింది. ఆ తరువాత కిషోర్ తిరుమల తన కథపై పనిచేస్తూ వున్నారని, ఈమధ్యనే రవితేజకి కథని వినిపించడం జరిగిందని కూడా తెలిసింది. కథ నచ్చి రవితేజ సినిమా చెయ్యాలని నిర్ణయించుకున్నట్టుగా కూడా తెలుస్తోంది. అయితే ఈ సినిమాని ఎవరు నిర్మిస్తారు అనే విషయం కూడా కొన్ని రోజుల్లో తెలియనుంది చెపుతున్నారు. కిషోర్ తిరుమల మంచి దర్శకుడిగా పేరు తెచ్చుకున్నారు, అలాగే క్లీన్ సినిమాలు నిర్మిస్తారని కుటుంబం అంతా చూసీ విధంగా వుంటాయి. కిషోర్ మంచి రచయిత కూడాను. ఇప్పుడు కిషోర్ తిరుమల, రవి తేజ కాంబినేషన్ లో రాబోయే ఈ సినిమా ఒక మంచి కుటుంబ కథా చిత్రంగా ఉండబోతోందని అంటున్నారు.